క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మ తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సౌత్‌ఎండ్‌పార్కు, స్వాతి రెసిడెన్సీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 9నుంచి 10 గంటల వరకు. 11కేవీ హుడాసాయినగర్, ఎల్‌బీనగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు. 11కేవీ శ్రీనివాసకాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మ ధ్యాహ్నం 12గంటల వరకు. 11కేవీ కమలానగర్, హరిపురికాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు. 11కేవీ అష్టలక్ష్మీదేవాలయ ం, పుష్పాగార్డెన్స్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు.

రాచులూరు, ముచ్చర్ల ఫీడర్ల పరిధిలో

కందుకూరు: చెట్ల తొలగింపు పనుల కారణంగా శనివారం నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోనలి 33 కేవీ రాచులూరు, 33 కేవీ ముచ్చర్ల ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

కందుకూరు తహసీల్దార్‌గా గోపాల్



గోపాల్‌ను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

కందుకూరు: కందుకూరు తహసీల్దార్‌గా కె.గోపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన మహేందర్‌రెడ్డి నల్గొండ జిల్లా మర్రిగూడకు బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు చేపట్టిన గోపాల్‌ను కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ 'యూత్ డిక్లరేషన్'పై నాయకుల ప్రచారం



సాయిరెడ్డిగూడలో ప్రచారం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డిగూడలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దంతోజు నర్సింహాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూత్ డిక్లరేషన్ గురించి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యువతకు కల్పించనున్న అవకాశాలు, సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు గొర్రెంక రమేశ్, ఎస్.శ్రీను, ఎం.శివ, పవన్, ఎం.బాలకృష్ణ, కె.అర్జున్, డి.కుమార్, మహేశ్, టి.అశోక్, డి.రవి, ఎం.భాస్కర్, కె.రాజు, బి.మల్లేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



బడంగ్‌పేట్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలను మెరుగు పరచాలని డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన కార్పొరేషన్ కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా 9, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యాప్రమాణాలను పరిశీలించారు. ప్రభుత్వ వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా రాణించాలన్నారు. పేదల కుటుంబాల్లో మార్పు విద్యతోనే సాధ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రెండేళ్లుగా పోరాడి రూ.25లక్షల కేటాయించేందుకు తీర్మానం చేయించానని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.అర్జున్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆదమరిస్తే.. అంతే!



పహాడీషరీఫ్: ఒకే స్తంభంపై నాలుగు కాసారాలకు ఉన్న విద్యుత్ వైర్లు



మీర్‌పేట: ప్రశాంతిహిల్స్ రోడ్ నెం-8లో జాయింట్స్ వేసిన విద్యుత్‌వైర్లు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు, మూగజీవాలకు ప్రాణసంకటంగా మారింది. ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్స్, వేలాడుతున్న విద్యుత్ వైర్లు, ఒరిగిన కరెంటు స్తంభాలతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ ప్రమాదాలతో జనం ప్రాణాలు కోల్పోతున్నా.. పశువులు మృత్యువాత పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు.

– మహేశ్వరం జోన్ బృందం

- ప్రమాదకరంగా మారిన విద్యుత్ సమస్యలు
- రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్స్, ఒరిగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న వైర్లు
- ప్రజలు విన్నవించినా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో జనం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్, మురళీకృష్ణనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఫ్యూజ్‌బాక్స్ కిందకు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకకముందే విద్యుత్ అధికారులు కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జాయింట్‌లతోనే సరి

మీర్‌పేట ప్రశాంతిహిల్స్ రోడ్‌నెం–8లో ముప్పై ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ లైన్‌లు నేటికీ మార్చకపోవడంతో తరుచూ వైర్లు తెగిపడుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఏళ్ల క్రితం వేసిన తీగలను మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు మొర పెట్టుకున్నా తాత్కాలికంగా జాయింట్లు వేస్తూ చేతులు దులుపుకుంటున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒక స్తంభం.. నాలుగు కాసారాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో విద్యుత్ తీగలు గజిబిగా మారాయి. ఏ విద్యుత్ స్తంభం చూసినా నాలుగు కాసారాలతో కనిపిస్తున్నాయి. పిట్టగూళ్లను తలపించేలా విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. బస్తీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చిన్నారులకు అందేంత ఎత్తులోనే ఉండడంతో ప్రమాదకరంగా మారాయి. షాహీన్‌నగర్‌లోని అమీనా ఫంక్షన్‌హాల్ వద్ద గతంలో జరిగిన విషాద ఘటన నేపథ్యంలో ఇటీవల చర్యలు చేపట్టారు. జల్‌పల్లి శ్మశాన వాటిక సమీపంలో ఒరిగిన విద్యుత్ స్తంభం గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తోంది.



కందుకూరు: మీర్‌ఖాన్‌పేట-వావిళ్లకుంటతండా మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



కందుకూరు: రహదారి పక్కన



మీర్‌పేట: లెనిన్‌నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్‌బాక్స్‌లు

తల్లిపాలే.. బిడ్డకు మేలు

కందుకూరు: తల్లి పాలతో బిడ్డ రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సర్పంచ్‌లు ఇందిర, సరళమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నోజిగూడ, బేగరికంచె గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో తల్లి పాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క తల్లి పుట్టిన బిడ్డకు వెంటనే తన పాలను పట్టించాలని సూచించారు. తల్లి పాలకు మించిన ఆహారం లేదన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సబిత మాట్లాడుతూ.. ఆరు నెలల వరకు తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలనే పట్టాలని, ఆ తర్వాత ఆహారం అలవాటు చేయాలన్నారు. రెండేళ్ల వరకు తల్లి పాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరళ, దేవి, శ్యామల, సునీత పాల్గొన్నారు.



అన్నోజిగూడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు

సీఎంఆర్‌ఎఫ్‌ను వినియోగించుకోవాలి

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి

కందుకూరు: సీఎంఆర్‌ఎఫ్‌ను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పులిమామిడికి చెందిన పసుపుల కొమురయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆయన ఆస్పత్రిలో ఖర్చుకు సంబంధించి జెడ్పీటీసీ సభ్యుడి చొరవతో మంత్రి ద్వారా సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.59 వేల చెక్కు మంజూరయింది. దీంతో శుక్రవారం బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పాండుగౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దామోదర్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి బాధితుడికి నివాసానికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి, యూత్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి చెక్కు అందజేస్తున్న జంగారెడ్డి

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఎంపీపీ జ్యోతి

కందుకూరు: గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయిస్తున్నామని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి అన్నారు. శుక్రవారం వారు మండల పరిధిలోని నేదునూరు, మాన్యగూడలో సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డితో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఇందిర, ఉప సర్పంచ్ బి.శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ పాండురంగారెడ్డి, వార్డు సభ్యులు ఎండీ అఫ్జల్‌బేగ్, డి.అనసూయచంద్రమౌళి, ఎస్.వెంకటేశ్, సంతోష, కరుణాకర్‌రెడ్డి, ఎ.నరసింహ, కె.మత్యాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు కె.రూప్‌చందర్, ఎ.బాలయ్య, ఎన్.శ్రీధర్, పి.నాగేష్, ఎండీ నయీం, వి.బాబు, ఎం.పర్వతాలు, ఎం.శివకుమార్, ఎం.కృష్ణ, మనోహర్, ఆంజనేయులు, శ్రీరాములు, కుమార్, రాజు, శ్రీశైలం, చంద్రారెడ్డి, రవి, మల్లారెడ్డి, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ, జగన్, బాలయ్య, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'చలో అసెంబ్లీ' నేపథ్యంలో ముందస్తు అరెస్టులు



అరెస్టును నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కందుకూరు: సమస్యల పరిష్కారం కోరుతూ ఏఎన్‌ఎంలు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీంతో శుక్రవారం పోలీసులు సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు, ఏఎన్‌ఎంలు పార్వతి, మంజుల తదితరులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కుమార్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడి కుర్మయ్య ఆధ్వర్యంలో కందుకూరు చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి పీఎస్ ఎదుట ఆందోళన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. అనంతరం సాయంత్రం అరెస్టు చేసిన వారిని పోలీసులు విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు శేఖర్, జి.కుమార్, కారోబార్ల సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, యాదయ్య, నర్సింహ, పంచాయతీ కార్మికులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల వైఫల్యంతో సమస్యలు

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్

పహాడీషరీఫ్: ప్రజా ప్రతినిధుల వైఫల్యంతోనే సమస్యలు తీవ్రమవుతున్నాయని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశఋారు. శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలపై ఆరాతీశారు. మురుగు పారుతున్నా అధికారులు, స్థానిక కౌన్సిలర్లు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మధుబన్ కాలనీ సీసీ రోడ్డు పక్కన మూడు నెలలుగా మురుగు పారుతున్నా కౌన్సిలర్ కన్నెత్తి చూడడం లేదని ఆరోపించారు. మంత్రి సబితారెడ్డి వైఫల్యం కారణంగానే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.వివేకానంద(కపిల్) గౌడ్, 17వ వార్డు కౌన్సిలర్ ప్రశాంతిగౌడ్, జల్‌పల్లి కౌన్సిలర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాం కాలనీలో మురుగును పరిశీలిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

'మహా పడావ్'ను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దత్తునాయక్, వెంకటరమణారెడ్డి తదితరులు

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దత్తునాయక్

మీర్‌పేట: కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈ నెల 9, 10 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'మహపడావ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.దత్తునాయక్, బాలాపూర్ మండల కార్యదర్శి వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం లెనిన్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మహాపడావ్ కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌ను మారుస్తూ చట్టం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో శంషాబాద్‌లో నిర్వహించే మహాపడావ్ కార్యక్రమంలో కార్మికులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎం.నరేందర్, పిచ్చిరాజు, శుక్రునాయక్, అంజయ్య, మైసయ్య, శంకరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో నూతన పిన్‌కోడ్‌లు

మీర్‌పేట: సరైన సమయానికి ఉత్తరాలు చేరుకునేందుకు నూతన పిన్‌కోడ్ నెంబర్లను ఉపయోగించాలని మీర్‌పేట సబ్ పోస్ట్‌మాస్టర్ కె.ఫ్లోరెన్స్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీర్‌పేట ప్రాంత వాసులు–500097, బడంగ్‌పేట, అల్మాస్‌గూడ –500112, వైశాలినగర్–500079, బాలాపూర్–500005, కంచన్‌బాగ్–500058 పిన్‌కోడ్‌లను ఉత్తరాలపై రాయాలని పేర్కొన్నారు. అదే విధంగా కాలనీల వారీగా బాలాపూర్ సాయినగర్–500005 మల్లికార్జుననగర్, వినాయకహిల్స్–500112, ధాతునగర్–500058, పోష్‌కాలనీ–500097, సాయికృపానగర్–500097, జైభారత్‌నగర్–500097, విరాట్‌నగర్, మారుతీనగర్, శివసాయికాలనీ–500079కి బదులుగా 500097 రాయాలని, దీంతో పాటు టీకేఆర్ కళాశాల హనుమాన్‌నగర్–500097, టీచర్స్‌కాలనీ–500079 పిన్‌కోడ్‌లు రాయాలని ఆమె తెలిపారు. మారిన పిన్‌కోడ్ నెంబర్లకు బదులుగా పాత నెంబర్లే రాస్తుండడంతో ఉత్తరాలు చేరేందుకు ఆలస్యమవుతోందని చెప్పారు.

ఆర్థిక సహాయం

తలకొండపల్లి: చంద్రధనకు చెందిన బీజేపీ నాయకుడు పరశురాములు ఇటీవల మృతి చెందారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆచారి పిలుపు మేరకు చంద్రధన బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ కుమార్, బాధిత కుటుంబ సభ్యులకు రూ. 7000 ఆర్థిక సహాయం అందజేశారు. వార్డు సభ్యులు కృష్ణవేణి, యాదగిరిగౌడ్, రాణి, రాజు, రేణుక, ప్రసాద్, శ్రీశైలం, మల్లయ్య, జంగయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

వైన్స్ టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి, ఎస్‌ఐలు

- నేటి నుంచి ఆగస్టు 18 వరకు స్వీకరణ

మహేశ్వరం: మహేశ్వరం ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో 2023–25 సంవత్సరానికి గాను 13 వైన్స్ షాపుల కేటాయింపునకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆసక్తి ఉన్న వారు శనివారం నుంచి ఆగస్టు 18 వరకు రూ.2లక్షల డీడీ చలాన్‌తో ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 21న డ్రా ఉంటుందని చెప్పారు. దరఖాస్తుకు సందేహాలున్న వారు మహేశ్వరం ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి–94409 02314, ఎస్‌ఐలు హన్మంతు–9640412156,ప్రవీణ్‌కుమార్–91771 36740 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలారు.

రిజర్వేషన్ల వివరాలు

సామాజిక వర్గం	షాపులు
గౌడ్స్	3 (పెంద్యాల–1, పెంద్యాల–2, తుక్కుగూడ–1)
ఎస్సీ	1 (కందుకూరు–1)
జనరల్	9 (మహేశ్వరం–1,2, తుక్కుగూడ–2, 3, 4, తుమ్మలూరు–1, కందుకూరు–2, గుమ్మడవెల్లి)

డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్

మహేశ్వరం: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వంటా–వార్పు కార్యక్రమంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. కార్మికులు నెల రోజులుగా ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



వంటా–వార్పుతో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు